ఒక్కొక్క చుక్కేసి.. రంగుల ముగ్గేసి..

సందడిగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీ



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీకి హాజరై రంగవల్లులు తీర్చిదిద్దుతున్న యువతులు, మహిళలు

- మెదక్ జిల్లా గూడూరు శివ్వంపేటలో నిర్వహణ
- పెద్దసంఖ్యలో హాజరైన మహిళలు, యువతులు
- రంగవల్లులతో పులకించిన గూడూరు

ఆంధ్రజ్యోతి అంటే ఎంతో ఇష్టం



ఆంధ్రజ్యోతి పత్రిక అంటే ఎంతో ఇష్టం. ప్రతీ రోజూ కచ్చితంగా చదువుతాను. పీఈటీగా ఉద్యోగం చేస్తూనే సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటాను. ఆంధ్రజ్యోతిలో వచ్చిన ముగ్గుల పోటీ ప్రకటన చూసి హాజరయ్యాను. గతంలోనూ ఆంధ్రజ్యోతి నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నా. అభిమాన పత్రిక నిర్వహించిన పోటీల్లో మొదటి బహుమతి రావడం ఎంతో సంతోషంగా ఉంది.

-దివ్య, చిన్నగొట్టిముక్ల (మొదటి బహుమతి విజేత)

బహుమతి రావడం సంతోషకరం



ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముగ్గుల పోటీలో రెండో బహుమతి రావడం సంతోషంగా ఉంది. గతంలోనూ ఆంధ్రజ్యోతి నిర్వహించిన పోటీలో పాల్గొన్నాను. అప్పట్లో మూడో బహుమతి వచ్చింది. వచ్చేసారి మళ్లీ పోటీల్లో పాల్గొని మొదటి బహుమతి గెలుచుకుంటాను.

-మాలతి, చేగుంట (రెండో బహుమతి విజేత)

ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు



ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముగ్గుల పోటీలో బహుమతి రావడం సంతోషకరం. మా స్వస్థలం దౌల్తాబాద్ కాగా గూడురు కస్తుర్బా విద్యాలయంలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నాను. ముగ్గుల పోటీ నిర్వహించడం ద్వారా ఆంధ్రజ్యోతి మహిళలు, యువతులను ప్రోత్సహించడం అభినందనీయం.

-సంతోషి, (మూడో బహుమతి విజేత)



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, మెదక్/నర్సాపూర్, జనవరి 6: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై బెంగళూరు ఎయిమ్స్ విద్యాసంస్థలు, రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన ఆధ్వర్యంలో శనివారం మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గూడురులో గురుదత్త చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు జి.శివకుమార్‌గౌడ్ సహకారంతో ఘనంగా నిర్వహించారు. నింగిలోని చుక్కలు నేలకు దిగి వచ్చినట్టు మహిళలు పోటీపడి ముగ్గులు వేశారు. ముత్యాల ముగ్గులతో ఆకట్టుకున్న విజేతలు నగదు బహుమతులు అందుకున్నారు. ముగ్గుల పోటీలో 60 మంది పాల్గొన్నారు. మొదటి బహుమతిని గొట్టిముక్లకు చెందిన దివ్య, రెండో బహుమతి చేగుంటకు చెందిన మాలతి, 3వ బహుమతి కస్తుర్బా పాఠశాల ఉపాధ్యాయురాలు సంతోషి గెలుపొందారు. వారికి గురుదత్త చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి సూర్యకుమార్‌గౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్ చారి, ఆంధ్రజ్యోతి జిల్లా ప్రతినిధి శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి ఆంధ్రజ్యోతి నర్సాపూర్ ఆర్సీ ఇన్‌చార్జి కె.శ్రీనివాస్, స్థానిక విలేకరులు గోవింద్, రాయగిరి తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయం : సూర్యకుమార్‌గౌడ్, గురుదత్త చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి



తెలుగు రాష్ట్రాల్లో దమ్మున్న మీడియాగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ మన సంస్కృతిని ప్రోత్సహించేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం. భవిష్యత్ తరాలకు సంస్కృతి సంప్రదాయలను తెలియజేసేందుకు ఇది ఉపయోగపడుతుంది. ప్రజల పక్షాన నిలబడి సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే ఆంధ్రజ్యోతి మరింత ఆదరణ పొందాలని ఆకాంక్షిస్తున్నా.

మహిళల అభిమానాన్ని చూరగొన్న ఆంధ్రజ్యోతి : తహసీల్దార్ శ్రీనివాస్‌చారి



మహిళలకు అత్యంత ఇష్టమైన ముగ్గుల పోటీలను నిర్వహించడం ద్వారా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వారి అభిమానాన్ని చూరగొన్నది. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ముందుండే ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ మహిళలను ప్రోత్సహించడంలోనూ ముందుండడం అభినందనీయం. కళలు, సాంస్కృతిక కార్యక్రమాల వైపు మహిళలను ప్రోత్సహించడానికి ఇది ఉపయోగపడుతుంది.



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలో మొదటి బహుమతి సాధించిన ముగ్గుతో విజేత దివ్య



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలో రెండో బహుమతి సాధించిన ముగ్గుతో విజేత మాలతి



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలో మూడో బహుమతి సాధించిన ముగ్గుతో విజేత సంతోషి

నేడు గుమ్మడిదలలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, జనవరి 6: సంక్రాంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన ఆధ్వర్యంలో నేడు గుమ్మడిదలలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరగనున్నాయి. ఉదయం 10 గంటలకు మొదలయ్యే ఈ ముగ్గుల పోటీలకు స్థానిక స్పాన్సర్‌గా పులిగిల్ల ఫౌండేషన్ చైర్మన్ పులిగిల్ల ప్రకాశంచారి వ్యవహరిస్తున్నారు. పోటీలో పాల్గొనే మహిళలు ఉదయం 9 గంటల వరకే వేదిక వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. మొదటి బహుమతి రూ.6వేలు, రెండో బహుమతి రూ.4 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు అందజేయడం జరుగుతుంది. పాల్గొనే ప్రతీ ఒక్కరికి ప్రోత్సాహక బహుమతి ఇస్తారు. మిగతా వివరాల కోసం ముగ్గుల పోటీకి సంబంధించిన ప్రకటనను చూడొచ్చు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

- మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపుతాం
- మెదక్ జిల్లా నూతన ఎస్పీ డాక్టర్ బాలస్వామి



మెదక్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న బాలస్వామి

మెదక్ అర్బన్, జనవరి 6: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని, మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలపై ఉక్కుపాదం మోపుతామని మెదక్ జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి పేర్కొన్నారు. మెదక్ జిల్లా ఎస్పీగా శనివారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయనకు అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆయనకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం నూతన ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కలిగించేవారిని, గంజాయి, మత్తు పదార్థాల రవాణా చేసేవారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చూడటం పోలీసు అధికారులు, సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతామన్నారు. అనంతరం నూతన ఎస్పీని అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్, డీఎస్పీలు వణీంద్ర, యాదగిరిరెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సైబర్ సెల్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్, జిల్లాలోని సీఐ, ఎస్ఐలు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపి పరిచయం చేసుకున్నారు.

కుమారుడి మరణ వార్త విని.. తల్లి మృతి


నర్సింహగౌడ్, లక్ష్మి (ఫైల్)

హవేళిఘణపూర్, జనవరి6: కుమారుడి మృతి తట్టుకోలేక తల్లి గుండెపోటుతో మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా హవేళిఘణపూర్ మండలంలోని కూచన్‌పల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వీరప్పగారి నర్సింహగౌడ్(38) భార్య, ఇద్దరు పిల్లలు, తల్లితో కలిసి నివసిస్తున్నాడు. రోజు మాదిరిగానే నర్సింహగౌడ్ శుక్రవారం నిద్రించాడు. శనివారం ఉదయం కుటుంబసభ్యులు లేపగా లేవకపోవడంతో వెంటనే మెదక్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న అతని తల్లి లక్ష్మి(57) అక్కడే కుప్పకూలిపోయింది. పరీక్షించిన వైద్యులు ఆమె గుండెపోటుతో మృతి చెందిందని నిర్ధారించారు. ఒకే రోజు కుమారుడు, తల్లి గుండెపోటుతో మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని స్నేహితులు అతని కుటుంబానికి రూ. 25 వేల ఆర్థిక సాయం చేశారు.


సీఎంఆర్‌ను నిర్ణీత గడువులోగా అందించాలి

● సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి


సంగారెడ్డి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి రూరల్, జనవరి 6: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను రైస్ మిల్లర్లు నిర్ణీత గడువులోగా అందించాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైస్ మిల్లర్లు పెట్టాల్సిన సీఎంఆర్ దిగుమతిలో ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయ్‌కు సంబంధించి ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. వానాకాలం 2023-24 ధాన్యం రవాణాకు సంబంధించి రసీదులను త్వరితగతిన సమర్పిస్తే డబ్బు చెల్లించడం జరుగుతుందని ధాన్యం రవాణా కాంట్రాక్టర్లకు చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్‌వో వనజాత, పౌరసరఫరాల శాఖ డీఎం సుగుణబాయ్, రైస్ మిల్లర్లు, ధాన్యం రవాణా కాంట్రాక్టర్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ జట్టు మేనేజర్‌గా వెంకటనర్సయ్య



అక్కన్నపేట, జనవరి 6: ఈ నెల 9 నుంచి 12 వరకు కర్ణాటక రాష్ట్రంలోని విజయపురలో జరగనున్న జాతీయ రోడ్ సైక్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ పురుషుల సైక్లింగ్ జట్టుకు మేనేజర్‌గా, అక్కన్నపేట మండలం మల్లంపల్లి ఉన్నత పాఠశాల పీఈటీ జంగపల్లి వెంకటనర్సయ్య ఎంపికైనట్లు శనివారం తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల్లో తెలంగాణకు చెందిన సైక్లిస్టులు మెరుగైన ప్రతిభ కనబరిచి అత్యధిక పతకాలు సాధించాలని కోరారు. వెంకటనర్సయ్య నియామకం పట్ల రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి టీ హరీశ్ రావు, జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా క్రీడల యువజన అభివృద్ధి అధికారి నాగేందర్, మల్లంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గూగులోతు రంగా, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

చెరకు రైతులకు బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా నాయకుడు యాదవరెడ్డి

జహీరాబాద్, జనవరి 6: చెరకు రైతులకు ట్రైడెంట్ యాజమాన్యం పెండింగ్ బిల్లులన్నీ వెంటనే చెల్లించాలని రైతుసంఘం జిల్లా నాయకుడు యాదవరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని హోతి(బి) గ్రామంలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో రైతులు స్థానికంగా ఉన్న ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని నమ్ముకుని చెరకు పంటను సాగుచేస్తున్నారన్నారు. అన్నీ వాతావరణాలకు చెరకుపంట తట్టుకుంటుందన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి పాలకులు, అధికారులు చెరుకు రైతుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. చెరకు రైతులకు పెండింగ్ బిల్లులు ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు షైపాల్, మల్లారెడ్డి, కిష్టప్ప, లక్ష్మారెడ్డి, జాకీర్, అల్లావుద్దీన్, సురేష్, వెంకటేష్, మోయియోద్దీన్, నరేష్, జమీర్, తదితరులు పాల్గొన్నారు.

మాదిగల భావప్రకటనా స్వేచ్ఛను కాపాడండి

●ఏపీ పాలకులకు లేఖ రాయాలని జిల్లా కలెక్టర్‌కు వినతి

మెదక్, జనవరి6, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిగల భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలిగేవిధంగా పాలకులు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, అక్కడ సభలూ, సమావేశాలూ నిర్వహించుకోవడానికి అనుమతులు ఇచ్చేందుకు ఆ ప్రభుత్వానికి లేఖ రాయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 6న గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మాదిగ విద్యార్థి సమాఖ్య, ఎంఎస్ఎఫ్ జాతీయ మహాసభ జరగాల్సి ఉండగా, జగన్ ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా ఎమ్మార్పీఎస్ ఉద్యమం అణిచివేయలేరని వారు హెచ్చరించారు. ఏపీ ప్రభుత్వం తమతీరు మార్చుకోవాలని, తదుపరి రోజుల్లో సభల నిర్వహణకు ముందస్తు అనుమతి కోసం ఆ ప్రభుత్వానికి లేఖ రాయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోఎమ్మార్పీఎస్ నాయకులు బాలరాజు, కందారం రాజు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, పుష్ప మాధవి, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.


కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

బీఆర్‌ఎస్ పాలనలో

మల్లన్న ఆలయంలో అంతా అవినీతే


విలేకరులతో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, జనవరి 6 : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మల్లన్న ఆలయంలో అవినీతి తాండవమాడిందని, అందినకాడికి దోచుకుని భక్తుల వసతుల కల్పన విస్మరించారని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. మల్లన్న కల్యాణం సందర్భంగా శనివారం ఆయన ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం తోటబావి ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఆలయాభివృద్ధికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి నీళ్లు తీసుకువస్తానని హామీ ఇచ్చి రైతులను మోసం చేశారన్నారు. అందుకే బీఆర్‌ఎస్ ఓటమి చవిచూసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి ప్రత్యేక నిధులు తీసుకువస్తానని, మల్లన్న ఆలయ సమగ్రాభివృద్ధికి పాటుపడతానన్నారు. స్థానిక నేతలు మల్లన్న ఆలయాభివృద్ధి పేరిట కోట్లు దండుకున్నారన్నారు. ప్రస్తుత పునరుద్ధరణ కమిటీ భక్తులకు సేవచేస్తూ అవినీతికి తావివ్వకుండా ఆలయాభివృద్ధికి పారదర్శకంగా పాటుపడి వన్నె తీసుకురావాలని సూచించారు. ఆయనవెంట మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

నేడే కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణం

- తోటబావివద్ద కల్యాణవేదిక ఏర్పాట్లు పూర్తి
- శోభాయమానంగా ఆలయ పరిసరాలు

చేర్యాల, జనవరి 6: కోరమీసాల కొమురవెల్లి మల్లికార్జునస్వామి పెండ్లికొడుకయ్యాడు. వీరశైవుల ఆడబిడ్డ అయిన మేడలాదేవీ, యాదవుల ఆడబిడ్డ అయిన కేతలాదేవీని వివాహమాడేందుకు సిద్ధమయ్యాడు. ఉజ్జయిని సద్ధర్మ సింహాసనాదీశ్వర వీరశైవ పీఠాధిపతి సిద్ధలింగ రాజదేశికేంద్ర శివాచార్య మహాస్వామి వేద పర్యవేక్షణలో కల్యాణం జరుపుతారు. కల్యాణంతో మూడునెలలపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది. ఈమేరకు తోటబావి ప్రాంగణంలోని కల్యాణమండపంలో వెండిసింహాసనంపై మనువాడనున్నారు. ఆలయవర్గాలు, ప్రభుత్వశాఖల అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. తోటబావి ప్రాంగణాన్ని గ్యాలరీలుగా విభజించి షామియానా, అరటిచెట్లు, మామిడి తోరణాలతో తీర్చిదిద్దారు. కల్యాణ వేదికను పూలతో అలంకరించారు. ప్రభుత్వం తరఫున రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ, బీసీ, రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50వేలమంది భక్తులు హాజరుకానుండడంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

నేటి నుంచి మల్లన్న గర్భాలయ దర్శనం

మూలవిరాటు అలంకరణ నిమిత్తం ఆరురోజుల క్రితం నిలిపివేసిన గర్భాలయ దర్శనం నేటి నుంచి పునఃప్రారంభం కానుంది. ఆదివారం తెల్లవారుజామున ముఖమండపంలోని భైరవ విగ్రహం ఎదుట బలిహారణ జరిపి దృష్టికుంభం నిర్వహించనున్నారు. గుమ్మడికాయను బలి ఇచ్చి స్వామివారికి మూడో నేత్రమైన చిత్రకన్నును అమరుస్తారు. అనంతరం పూజలు జరిపి కల్యాణ వేడుకలను ప్రారంభించనున్నారు. తోటబావి వద్ద ఉత్సవ విగ్రహాలతో కల్యాణం నిర్వహిస్తున్న క్రమంలో గర్భాలయంలోనూ మల్లన్నకు శాస్త్రోక్తంగా కల్యాణం జరుపుతారు.


గ్రామంలో బియ్యం సేకరిస్తున్న వీరశైవార్చక కుటుంబసభ్యులు

బియ్యం సేకరణ

దృష్టికుంభం నిర్వహణకు శనివారం రాత్రి గ్రామంలో వీరశైవార్చకులు వీరభద్రుడి పళ్లెరాన్ని చేతపట్టుకుని అర్చకుల ఇళ్ల నుంచి బియ్యాన్ని సేకరించారు. అనంతరం గ్రామంలోని అన్నికుల సంఘాలతో పాటు గ్రామస్థులు బియ్యాన్ని అందించారు. కాగా గతేడాది కల్యాణంలో మల్లన్నకు బంగారు కిరీటం, కోరమీసాన్ని ధరింపజేశారు, ఈఏడాది అమ్మవార్లకు కూడా బంగారు కిరీటాలు చేయిస్తామని ప్రకటించినా, దేవాదాయశాఖాధికారులు అమలు చేయకపోవడం గమనార్హం.

> **కల్యాణానికి ఏర్పాట్లు పూర్తిచేశాం**
>
> మల్లన్న కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేపట్టాం. ఎలాంటి సమస్యలు ఎదురవకుండా చర్యలు తీసుకున్నాం. ప్రతీ భక్తుడు దివ్యానుభూతికి లోనయ్యేలా కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రసాదాన్ని భక్తులకు అందుబాటులో ఉంచాం. కల్యాణం అనంతరం స్వామివారి శకటోత్సవం ఘనంగా జరిపేలా చర్యలు తీసుకున్నాం.
>
> -ఈవో బాలాజీశర్మ

పునరుద్ధరణ కమిటీసభ్యులకు అభినందన

మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులుగా 20మంది నియామకమైన నేపథ్యంలో శనివారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వారిని అభినందించారు. ఆలయంలో పూజలు చేసిన అనంతరం పాలకమండలి కార్యాలయంలో సమావేశమై పర్పాటకం లక్ష్మారెడ్డిని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఆలయాధికారులు మర్యాదపూర్వకంగా సత్కరించారు.

కల్యాణ విధులను అదృష్టంగా భావించాలి

కొమురవెల్లి మల్లన్న కల్యాణం సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు విధులు నిర్వర్తించడం అదృష్టంగా భావించాలని, భక్తులతో మర్యాదగా వ్యవహరించాలని సిద్దిపేట అడిషనల్ అడ్మిన్ డీసీపీ అందె శ్రీనివాసరావు అన్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ తోటబావి ప్రాంగణంలో శనివారం జిల్లాస్థాయి పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించి విధుల నిర్వహణపై సూచనలు చేశారు. అడిషనల్ డీసీపీలు-2, ఏసీపీ-3, సీఐలు-12, ఎస్‌ఐలు18మందితో పాటు ఏఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డుల, యాక్సెక్ కంట్రోల్, రోప్ పార్టీ సిబ్బందితో కలిపి మొత్తం 300మందితో పటిష్ఠందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఒక్కొక్క చుక్కేసి.. రంగుల ముగ్గేసి..

- సందడిగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు
- పెద్దసంఖ్యలో హాజరైన మహిళలు, యువతులు


మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గూడూరులో నిర్వహించిన పోటీలో మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు


గూడూరులో ముగ్గు వేస్తున్న మహిళలు


గురుదత్త చారిటబుల్‌ట్రస్టు ప్రతినిధిని సన్మానిస్తున్న ఆంధ్రజ్యోతి ప్రతినిధులు




గూడూరులో నిర్వహించిన మెదక్ జిల్లాస్థాయి పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్, తదితరులు



సిద్దిపేటలో నిర్వహించిన ముగ్గుల పోటీలో మొదటి బహుమతి అందుకుంటున్న లత, మూడో బహుమతి అందుకుంటున్న రజిత


ముగ్గుల పోటీలో రెండో బహుమతి అందుకుంటున్న రేణుక


ముగ్గుల పోటీకి హాజరైన మహిళలు



సిద్దిపేటలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలో ముగ్గులు వేస్తున్న మహిళలు

ప్రజల వద్దకు ప్రభుత్వాన్ని తీసుకురావడమే ప్రజాపాలన

- అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తాం
- నర్సాపూర్ ఆస్పత్రికి డయాలసిస్ కేంద్రం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో దరఖాస్తులను స్వీకరించిన మంత్రి



మెదక్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎమ్మెల్యే రోహిత్‌రావు



రుస్తుంపేటలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, చిత్రంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి

నర్సాపూర్, జనవరి 6: ప్రజల వద్దకు ప్రభుత్వాన్ని తీసుకురావడమే ప్రజాపాలన ఉద్దేశమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ మండలం రుస్తుంపేటలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తామని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగుతాయన్నారు. నర్సాపూర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో త్వరలో డయాలిసిస్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని ప్రాంతాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. అరవై సంవత్సరాలు పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్ల పాలించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.6 లక్షల కోట్ల అప్పులు చేసి, మోసం చేసిందని మంత్రి విమర్శించారు. గత ప్రభుత్వం కళాశాలలు, ఇతర భవనాలు నిర్మించి, వసతుల కల్పనలో విఫలమైందని ఆరోపించారు. ఉద్యోగులు, సిబ్బంది లేకుండా సేవలు ఎలా అందుతాయని ఆయన ప్రశ్నించారు. జిల్లాకో వైద్యశాల అంటూ నియామకాలు ఎందుకు చేపట్టలేకపోయారని ప్రశ్నించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం పోషించిందన్నారు. కోట్ల రూపాయలు అప్పులు చేసినా గ్రామాల్లో ఇళ్ల స్థలం, గజం జాగా ఇవ్వలేదని మంత్రి మండిపడ్డారు. బిశ్వాల్ కమిటీ లక్షా 94 వేల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని నివేదిక ఇచ్చినా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయారని విమర్శించారు. హామీలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొదటి క్యాబినెట్‌లోనే ఆరు గ్యారంటీల తీర్మానం చేశారని మంత్రి తెలిపారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 1,98,000 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. దరఖాస్తులన్నింటిని ఆన్‌లైన్ చేసేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, సర్పంచు రాజు, జడ్పీటీసీ బబ్యానాయక్, ఎంపీపీ జ్యోతి, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాధించాలనే తపన ఉన్న వ్యక్తి రోహిత్‌రావు

మెదక్ మున్సిపాలిటీ: ఏదైనా సాధించాలనే తపన ఉన్న వ్యక్తి మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావ్ అని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. కాగా ఏరియా ఆస్పత్రిలో సిటీ స్కానింగ్ ఏర్పాటు చేయాలని ఆస్పత్రి సిబ్బంది మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. మెదక్ మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని చైర్మన్ చంద్రపాల్ కోరగా స్పందించిన మంత్రి.. "సేటు మీరడిగిందేమిటి" అని ప్రశ్నిస్తూ.. గత ప్రభుత్వం రూ.ఆరు లక్షల కోట్లు అప్పు చేసిందని చెప్పారు. అంచెలంచెలుగా అభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడుతూ.. హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ఒకే దరఖాస్తుతో ముందుకు వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ రమేశ్, మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, కౌన్సిలర్లు శ్రీనివాస్, లక్ష్మీనారాయణగౌడ్, కొట్టాల విశ్వం, సుప్రభాతరావ్, నాయకులు ఆవుల రాజిరెడ్డి, మేడి మధుసూదన్‌రావు, బొజ్జ పవన్, గంగానరేందర్, జీవన్‌రావ్, ముత్యంగౌడ్, ఉప్పల రాజేష్, గుడూరి ఆంజనేయులుగౌడ్, హఫీజొద్దీన్, విప్లవ్‌కుమార్, మన్సూర్ అహ్మద్, షైసన్ పాల్గొన్నారు.

ప్రభుత్వాలను శాసించే అధికారం ప్రజలదే

తూప్రాన్/చేగుంట: ప్రభుత్వాలను శాసించే అధికారం ప్రజలదేనని, ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ న్యాయ నిర్ణేతలు అని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. చేగుంట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజలకు తొమ్మిది సంవత్సరాలుగా సమస్యలపై మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, నేడు కాంగ్రెస్ ద్వారానే ప్రజలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. జోనల్ వ్యవస్థపై మెదక్‌జిల్లా వాసులకు ఇబ్బందులు ఉన్నాయని, వాటి రద్దు కోసం సీఎంతో భేటీ తర్వాత అవసరమైతే రాష్ట్రపతి వద్దకు తీసుకెళ్లనున్నట్లు మంత్రి వెల్లడించారు. కాంట్రాక్టు ఏఎన్ఎంలను క్రమబద్ధీకరణకు ముఖ్యమంత్రితో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా అదనపు కలెక్టర్ రమేష్, డీపీవో సాయిబాబా, డీఎంహెచ్‌వో చందూనాయక్, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, మండల ప్రత్యేక అధికారి జమ్లానాయక్, ఎంపీడీవో ఆనందమేరీ, తహసీల్దార్ గియా ఉన్నిసా బేగం, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, పీసీసీ మాజీ సభ్యుడు సుప్రభాత్‌రావు, చేగుంట, నార్సింగి మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు వడ్ల నవీన్‌కుమార్, ఆకుల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. తూప్రాన్ పట్టణంలోని 16వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మంత్రి దామోదర్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, కలెక్టర్ రాజర్షిషా, కాంగ్రెస్ నాయకులు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, ఆవుల రాజిరెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు నారాయణగుప్తా, జిన్న భగవాన్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రవీందర్‌గుప్తా, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

గతంలో నారాయణఖేడ్‌కు మొండి చేయి: సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సభలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట, నారాయణఖేడ్ తనకు రెండు కళ్లని నమ్మబలికించి సిద్దిపేటకు కోట్లాది రూపాయల నిధులు తరలించి, నారాయణఖేడ్‌కు మొండి చేయి చూపించారన్నారు. తాము గత పాలకుల మాదిరిగా కాకుండా అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనాబేగంనజీబ్, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, సేవాలాల్ సంఘంరాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముంతాజ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తాహేర్, మాసాని కృష్ణ, పండరిరెడ్డి, సాయిలుపటేల్, శంకర్‌ముదిరాజ్, సుబురు, అంజయ్య, విఠల్, రాజు, వెంకన్న పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదు పారదర్శకంగా ఉండాలి

- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 6: ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను పూర్తి పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి మండలాల ప్రత్యేకాధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో శనివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. డేటా ఎంట్రీ ప్రక్రియ ప్రారంభించాలని, తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని సూచించారు. పర్యవేక్షణ అధికారులు పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ పూర్తయ్యే వరకు పర్యవేక్షించాలని, ఆన్‌లైన్‌లో నమోదు కాగానే దరఖాస్తులను భద్రపరచాలని చెప్పారు.

సంగారెడ్డిలో 4లక్షలు, మెదక్‌లో 2.73లక్షల దరఖాస్తులు

సంగారెడ్డి టౌన్/మెదక్ అర్బన్: గత నెల 28 నుంచి ఈ నెల 6 వరకు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో సంగారెడ్డి జిల్లాలో నాలుగు లక్షల దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని 647 గ్రామ పంచాయతీలు, ఎనిమిది మున్సిపాలిటీల్లో దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం నాలుగు లక్షల దరఖాస్తులు రాగా గ్రామల నుంచి 2,65,000 దరఖాస్తులు రాగా, మున్సిపాలిటీల్లో 1,35000 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మెదక్ జిల్లాలోని 469 గ్రామ పంచాయతీలు, మున్సిపల్ 75 వార్డుల్లో ఇప్పటి వరకు మొత్తం 2,73,389 దరఖాస్తులు వచ్చాయి. ఈ ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను డాటా ఎంట్రీ ఆపరేటర్లు పరిశీలించి వాటిలోని పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 17 వరకు కొనసాగనుంది.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



కల్హేర్‌లో పదవ తరగతి ప్రత్యేక తరగతుల గురించి తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి నర్సింహరావు

కల్హేర్, జనవరి 6: పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని పదవ తరగతి పరీక్షల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి నర్సింహరావ్ ఉపాధ్యాయులకు సూచించారు. కల్హేర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంఈవో శంకర్‌తో కలిసి పాఠశాల సిబ్బందితో సమావేశమయ్యారు. వంద శాతం ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఆయనవెంట పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శైలజ, ఉపాధ్యాయులు మోహన్, సంజీవ్‌కుమార్, రాజయ్య, మురళీగౌడ్, మశ్చందర్, ప్రదీప్ ఉన్నారు.

చిన్నశంకరంపేట తహసీల్దార్‌గా మన్నన్



చిన్నశంకరంపేట, జనవరి 6: చిన్నశంకరంపేట నూతన తహసీల్దార్ ఎమ్.ఏ.మన్నన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన చంద్రశేఖర్ రెడ్డి మనోహరాబాద్ మండలానికి బదిలీ అయ్యారు.

మనోహరాబాద్ తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

మనోహరాబాద్: మనోహరాబాద్ నూతన తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయనను ఇంతకుముందు పనిచేసిన తహసీల్దార్ శ్రీనివాస్‌రావ్ సన్మానించి బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో తూప్రాన్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, కౌశికా, ఆర్ఐ దీక్షిత్ పాల్గొన్నారు.

రైతుబీమా చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

పెద్దశంకరంపేట, జనవరి 6: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన రైతు కుమ్మరి సత్యనారాయణ ఇటీవల మృతి చెందాడు. ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.5 లక్షల రైతుబీమా చెక్కును శనివారం నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి బాధిత రైతు కుటుంబీకులకు అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, నాయకులు సాయిలు, సుభాష్, సంగమేష్, శంకర్, మహేష్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

మెదక్‌లో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

- మంత్రి దామోదర్‌కు వినతి



మంత్రిని కలిసిన బాబానగర్‌వాసులు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 6: మెదక్ జిల్లాలో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహకు ప్రెస్‌క్లబ్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. మెదక్‌లో శనివారం ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నరేష్‌గౌడ్, ప్రసాద్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో సుమారు 1,000 మంది జర్నలిస్టులు ఉన్నారని, సుమారు 5,000 ప్రభుత్వ పెన్షన్‌దారులున్నట్లు పేర్కొన్నారు. వారి అవసరాలకుగాను వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు. మంత్రిని కలిసినవారిలో నాయకులు రియాజ్, శ్రీనివాస్‌చారి, సురేందర్‌రెడ్డి, నాగరాజుశర్మ, రాధ్వల కృష్ణ, ఫారూఖ్, ఫయాజ్ తదితరులు ఉన్నారు.

బాబానగర్ రోడ్డుపనులు చేపట్టాలి

జహీరాబాద్, జనవరి 6: జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని రంజోల్ గ్రామ సమీపంలోగల బాబానగర్‌కు రోడ్డుపనులు చేపట్టేలా కృషి చేయాలని బాబానగర్‌వాసులు శనివారం హైదరాబాద్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను మంత్రిదృష్టికి తీసుకెళ్లారు. త్వరలో రోడ్డుపనులు చేపట్టేలా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

మంత్రికి గజమాలతో సన్మానం

మెదక్ అర్బన్/హత్నూర: మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు శనివారం గజమాలతో మంత్రి దామోదర్‌ను సన్మానించారు. అదేవిధంగా దౌల్తాబాద్‌లోని అంబేద్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు మంత్రి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎం.ఏ.హకీమ్, హత్నూర మండలాధ్యక్షుడు కర్రే కృష్ణ, దౌల్తాబాద్ సర్పంచ్ కొన్యాల వెంకటేశం, ఉప సర్పంచ్ రియాజ్, శశిధర్‌రెడ్డి, నరసింహారెడ్డి, వెంకటేశం, జగన్ యాదవ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. మెదక్‌లో మంత్రి దామోదర్‌ను టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఆధ్వర్యంలో సన్మానించారు. అలాగే ఎమ్మెల్యే రోహిత్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఇక్బాల్ పాష, ఫజులొద్దిన్, యూనిట్ అధ్యక్షుడు శివాజీ, పంచాయతీ రాజ్ ఉద్యోగుల జిల్లా సహాధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహిళలకు అండగా భరోసా కేంద్రాలు

- సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

సంగారెడ్డి క్రైం, జనవరి 6: అత్యాచార, పోక్సో వంటి కేసులలో మహిళలకు భరోసానిస్తూ, వారిలో కొండంత ధైర్యాన్ని నింపేందుకే దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో మెడికల్ అధికారులు, మహిళా పోలీసు అధికారులు, సిబ్బందికి పోక్సో, అత్యాచార కేసులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధిత మహిళలకు అన్ని రకాల సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్నదే ఈ భరోసా కేంద్రం ముఖ్య ఉద్దేశమన్నారు. వైద్యులు, పోలీసులు 24/7 విధుల్లో ఉంటూ బాధిత మహిళలతో మరింత సున్నితంగా వ్యవహరించాలని చెప్పారు. పోక్సో వంటి కేసుల్లో మైనర్లను ఫ్రెండ్లీ విధానంలో విచారించాలని సూచించారు. దేశ వ్యాప్తంగా అత్యాచార కేసుల్లో 80 శాతం పోక్సో కేసులేనని జిల్లా అదనపు ఎస్పీ అశోక్ అన్నారు. నేటి బాలలే రేపటి దేశ నిర్మాతలని, అలాంటి బాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నదని చెప్పారు. డాక్టర్ ఏఏ కేసులలో ఆరోగ్య పరీక్షలు ఏ విధంగా చేయాలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ అనిల్‌కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సుధ, జ్యోతి, వీణ, నరేష్, అఖిల, ప్రియదర్శిని, మానస, డీఎస్పీ రమేష్‌కుమార్, డీసీఆర్‌బీసీఐ రమేష్, జిల్లా మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడిని ఇంకెప్పుడు పట్టుకుంటారు?

- పోలీస్ స్టేషన్ ఎదుట బాధితుల ఆందోళన

చేగుంట, జనవరి 6: ఉద్దేశపూర్వకంగా కారును జనాల మీదకు తీసుకెళ్లి, ప్రమాదానికి కారణమైన నిందితుడిని ఇంకెప్పుడు పట్టుకుంటారని బాధిత కుటుంబీకులు చేగంటు పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం ఆందోళన చేశారు. రోడ్డుపై కూర్చుని రాస్తారోకో చేపట్టారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి వడ్డెర కాలనీలో జరిగిన పెళ్లి బరాత్ గుంపు మీదకు కారు దూసుకెళ్లడంతో ఉప్పు రమ్య మృతి చెందగా మరో నలుగురు తీవ్ర గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారకుడైన ఉప్పు నరేందర్‌ను పోలీసులు పట్టుకోకుండా, అతడి గురించి ఎలాంటి సమాచారం చెప్పడం లేదని పేర్కొంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీస్ స్టేషన్‌లో ఉంచి, నిందితుడు పరారైనప్పటికీ పోలీసులు ఏమాత్రం పట్టించుకోకపోవడం తగదన్నారు. పోలీసులు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ మెదక రోడ్డుపై బైఠాయించారు. సుమారు గంట పాటు మెదక్-చేగుంట రహదారిపై బైఠాయించగా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. రామాయంపేట సీఐ లక్ష్మీబాబు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడి సముదాయించారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టామనిపేర్కొన్నారు. నిందితుడిని పట్టుకుని కఠిన శిక్ష విధించేలా చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. అనంతరం వారందరినీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



చేగుంట పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రమ్య బంధువులు

న్యాయాధికారిని కలిసిన కలెక్టర్



న్యాయాధికారికి పూలమొక్కను అందజేస్తున్న కలెక్టర్

సంగారెడ్డి టౌన్, జనవరి 6: సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వల్లూరు క్రాంతి శనివారం జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి కుటుంబీకులతో కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

నారాయణఖేడ్: తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను కలెక్టర్ క్రాంతి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జట్ల భాస్కర్, సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు మామిడాల రవికుమార్, ఆరిగే శ్రీనివాస్, న్యాలం శివకుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, జనవరి 6: జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు సమయం ఆసన్నమైంది. ఈ నెల 8నుంచి 10వరకు సంగారెడ్డిలోని శాంతినగర్‌లో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శనివారం డీఈవో వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈసారి వైజ్ఞానిక ప్రదర్శనకు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి సుమారు 900 వరకు ప్రదర్శనలు రావచ్చుని చెప్పారు. వాటికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం డీఈవో కమిటీ సభ్యులతో తుది సన్నాహక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ నెల 8న ఉదయం 8 గంటలకు థీమ్స్ వారిగా రిజిస్ట్రేషన్స్ ప్రారంభమవుతాయని, తమ సైన్స్ ఎగ్జిబిట్స్‌ను తీసుకొని విధిగా అందరూ రిపోర్టు చేసి కేటాయించిన గదుల్లో ప్రదర్శించేలా చూడాలని సూచించారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి విజయకుమార్, సీఎంవో వెంకటేశం, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, కన్వీనర్ జాకీర్‌హుస్సేన్, ఓవరాల్ కమిటి ఇన్‌చార్జి ప్రభాకర్, జగదీశ్వర్, పాఠశాల యాజమాన్యం సాల్మోన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే జీవితానికి సార్థకత

- అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహరాజ్



పెద్దశంకరంపేటలో అయోధ్యరాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సంగ్రాం మహరాజ్ ఎంపీపీ, సర్పంచ్

పెద్దశంకరంపేట, జనవరి 6: ఆధ్యాత్మిక చింతనతోనే మానవ జీవితానికి సార్థకత లభిస్తుందని అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్, దేవిదాస్ మహరాజ్ అన్నారు. శనివారం పెద్దశంకరంపేట పట్టణంలోని రామాలయంలో అయోధ్య శ్రీరాముని అక్షింతల కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామాలయం నుంచి భవాని మందిరం వరకు ఊరేగింపుగా వెళ్లి ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచు సత్యనారాయణ, రామాలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు, కోశాధికారి రవీందర్, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, దత్తు, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర సభ్యులు సీతారామారావు, దాదిగారి గంగాధర్, సత్యనారాయణ, సర్వేశ్వర్, నర్సింలుచారి, సంతోష్‌కుమార్, రవివర్మ, సతీష్ గౌడ్, వీరప్ప, జైహింద్‌రెడ్డి పాల్గొన్నారు.

డాకూరు ఆలయంలో విగ్రహాల చోరీ



డాకూరు శివారులోని మాలకుంటలో విగ్రహాలను పరిశీలిస్తున్న పోలీసులు, ప్రజాప్రతినిధులు

జోగిపేట, జనవరి 6: డాకూరు ఆలయంలో విగ్రహాల చోరీ విషయం శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. జోగిపేట ఎస్ఐ అరుణ్, ఆలయ పూజారి తెలిపిన వివరాల ప్రకారం.. డాకూరు శివారులో పంట పొలాల మధ్యన నిర్జన ప్రదేశంలో ఉండే పురాతన చెన్నకేశవ స్వామి ఆలయంలో గత సోమవారం చోరీ జరిగింది. శనివారం ఉదయం గ్రామ శివారులోని మాలకుంట కాలువలో శివుడి విగ్రహాలు గ్రామస్థుల కంటపడ్డాయి. ఈ విషయాన్ని ఆలయ పూజారి, సర్పంచ్, పోలీసులకు గ్రామస్థులు తెలిపారు. ఎస్ఐ అరుణ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆలయంలోకి వెళ్లి చూడగా, విగ్రహాలతో పాటు 30 తులాల వెండి వస్తువులు, ఆభరణాలు కూడా చోరీకి గురైనట్లు గుర్తించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్ తెలిపారు.


ఏడుపాయల చెక్‌డ్యాంలో మృతదేహం లభ్యం

పాపన్నపేట, జనవరి 6: ఏడుపాయల చెక్‌డ్యాంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పాపన్నపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి వెల్లడించారు. శనివారం ఏడుపాయల చెక్‌డ్యాంలో మృతదేహం ఉన్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. మృతుడి వయస్సు 30-35 సంవత్సరాలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రగ్స్ తయారీ కేంద్రంపై అధికారుల దాడులు!

సంగారెడ్డి అర్బన్, జనవరి 6: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొంతపల్లి పారిశ్రామిక వాడలో అనుమతులు లేకుండా మందులు తయారు చేస్తున్న కంపెనీపై శుక్రవారం సాయంత్రం డ్రగ్స్ కంట్రోల్ అధికారులు దాడులు చేశారు. బొంతపల్లిలోని రక్షిత్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అనుమతులు లేకుండా డయాసిరిస్ మందు తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అధికారులు తనిఖీలు నిర్వహించారు. లేబుల్ చేసి పసుపు రంగు పొడి నింపిన తొమ్మిది డ్రమ్ములను గుర్తించారు. దీని విలువ రూ.50.25 లక్షలు ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో డయాసిరిస్ డ్రమ్ములను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి కంపెనీపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

హాస్టల్‌లో న్యాయాధికారి ఆకస్మిక తనిఖీ



హాస్టల్‌లో వంట గదిని పరిశీలిస్తున్న న్యాయాధికారిణి ధనలక్ష్మి

జోగిపేట, జనవరి 6: జోగిపేటలోని సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌ను జోగిపేట మున్సిఫ్ కోర్టు అసిస్టెంట్ జూనియర్ సివిల్ న్యాయాధికారిణి ధనలక్ష్మి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని వంట గదిలోకి వెళ్లి పరిశీలించారు. వంటలను, గది శుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. జీవితంలో లక్ష్యాన్ని ఏర్పరచుకుని, క్రమశిక్షణ, కఠోర శ్రమతో సాధించాలని సూచించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.